ఓం

శుభమస్తు అవిఘ్నమస్తు

# 1. గణేశ పంచరత్నమ్

# 2. శివాపరాధ క్షమార్పణ స్తోత్రమ్

(శ్రీ ఆదిశంకరాచార్య ప్రణీతము)





**సంస్కృత శ్లోకములకు**

**తెలుగు పద్య తాత్పర్యములు**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.



**1. గణేశ పంచరత్నమ్**

**2. శివాపరాధ క్షమార్పణ స్తోత్రమ్**


మొదటి ప్రచురణ

అక్టోబర్ 2008



రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.



వెల : అమూల్యం

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 040-23814379

డి.టి.పి. & ప్రింటింగ్ :

కె. మురళీ కృష్ణ

9848515109




## ప్రార్థన

కం॥ శ్రీవాణీ కరిముఖులను
సేవింతున్ నిల్వమదిని స్థిరవాసముగా
నే విశ్వనాధ! స్తోత్రము
నీవిధి ‘అపరాధ క్షమకు’ నికచెప్పెదరా!

తే॥ ‘తండ్రి’ అని తెలియక ‘బిడ్డ’ తాను పోరి
గజముఖుండయ్యె తలతెగి, గణపతయ్యె
ఆదిశంకరులిచ్చిన అగజసుతుని
‘పంచరత్నము’ లిటుజెప్ప భాగ్యమవదె!

ఆ॥ సురుల నేత ఒకడు, సురసేవితుడొకండు
హరుని ముద్దుబిడ్డలైన వారు
తల్లిదండ్రిగూడి తగువరంబులనీయు
జగతి పాలకులకు సాటిగలరె?



చం॥ ప్రతి క్షణమో మహేశ! అలవాటుగ నే
నొనరించు చుంటిరా
అతిశయ మెక్కి తేలికగ అంతెరుగంగక కోట్ల
కెక్కుడై
మితిగన లేని తప్పులను మేలును యెంచక
సిగ్గువీడుచున్,
స్తుతి యిదినన్ క్షమింపుమని జూపుమనంచని
నీదు సత్కృపన్

ఆ॥ మునులకైన గాని, మును రాక్షసులకైన
వివిధ సిరులుగల కుబేరుకైన,
హరి విరించికైన ఆదిత్యులకునైన
అండ యెవరు? శంకరుండు గాక

ఉ॥ తొల్లి వినాయకున్ గొలిచి తోరపుబొజ్జకు మ్రొక్కి
సత్కృపన్
అల్లితి పద్యరూపమున ఆ వ్రతగాథను తృప్తి
జెందితిన్
ఇల్లిదె ఆదిశంకరుల ఈశ్వరపుత్రుని
పంచరత్నముల్
ఉల్లమునందు 'జోత' లిడి ఒప్పుగ జెప్పెద
దీని నివ్విధిన్

తే॥ చేయు ఆలోచనేమిటో చెప్పదొకతె,
చెప్పినది తాను ఎన్నడూ చేయదొకతె,
చేయునపుడు ఆలోచించి చేయదొకతె,
ఒకతె మించిన దొక్కతె ఓ మహేశ!

(మొదటిది మనస్సు, రెండవది నాలుక,
మూడవది శరీరం మనిషిని అధోగతిపాలు చేస్తాయి.)

5

చం॥ తను వికటాట్టహాసమున తక్కువ జేయుచు
నవ్వుచున్న, చం
ద్రుని గని కిన్కబూని యనె "ధూర్త! జగంబున
ఎవ్వడైనను
నిను గన వానికౌను 'అపనిందలు' మెండుగ,"
ఘోరశాపమున్
తనుయిడి, లోకులార్తి గని దానిని మార్చెను
ఏకదంతుడున్

ఆ॥ బేసికనులవాడు, బిచ్చమెత్తెడివాడు,
బూదిదాల్చువాడు, భూతపతియు
విషము మ్రింగువాడు, వినువీధి సిగలోన
చంద్రవంక మిణుకు సర్పధారి.

6

సీ॥ జగముల సృజియించు చతురాననుడు 'బ్రహ్మ'
మరలనిన్ బ్రతికించి మహిమలిచ్చె
జగముల పాలించు జగదీశ్వరే నీకు
పాలిచ్చె ఒడిచేర్చి పరవశించి
జగములంతము జేయు సర్వేశ్వరుడు నీకు
బ్రహ్మోపదేశపు ప్రాప్తినిచ్చె
జగముల రక్షించు జలజనాభుడు 'హరి'
నిన్ను పూజించెను నింద తొలగి

తే॥ జగము జుట్టిరా ఎలుకయే సాయమాయె
జగములందున విఘ్నముల్ తగులనీక
జగములార్తిని దీర్చెడి సద్గురునిగ
జగములన్ తొలిపూజలు స్వామిగొనును.

7

ఉ॥ శూలి, పినాకపాణి, మధుసూదను నెయ్యము,
శూర్పకర్ణుకున్
మేలుగ 'విఘ్ననాథు'డను మేలగు పట్టము
నిచ్చె నాడు, ఆ
కాలునికైన శిక్షనిడి, గాచె మృకండుని
ముద్దుపట్టినిన్
ఏల కుశంక? శంకరుని ఇంకను జేరవె!
వెర్రి చిత్తమా.

శా॥ ఆకారంబిదియంచు జెప్పతరమా? అన్నారు
యోగీశ్వరుల్
కీకారణ్యములందు జేసి తపముల్ కీర్తించుచున్
గాంచనై
ఏకాకారుడు జ్యోతిరూపి యనుచున్ ఈశున్
మదిన్ గొల్వగా
సాకారంబున వారిచెంత నిలిచెన్ సాక్షాత్క
రించెన్ గదా!

8

# అంకితం

అపూర్వ సహోదరులైన గజాననునికీ,
షణ్ముఖునికీ జంటగా భక్తితో.....

చంII పతిజతగాక బోయినను "పార్వతినందను'
నిచ్చె గౌరి, ఆ
సతి తన స్తన్యమీయకనె స్కందుని తావెలయించె
శూలియున్
జతయగు ఆదిదంపతులు జన్మలనిచ్చిన
శ్రేష్టపుత్రులన్

మతిగొని 'అంకితమ్ము' నిడి మమ్ముతరింపగ
జేయ వేడెదన్



# ముందుమాట

**శ్లో॥ అగజాననపద్మార్కం గజానన మహరిశం**
**అనేకదంతం భక్తానాం ఏకదంతముపాస్మహే.**

మనలో చాలామంది ఈ గణేశ్వర ప్రార్థన చేస్తూనే వుంటాం. దీని అర్థం తెలిసినవారు ఎంతమంది ఉంటారు, ఊహించండి. నిజాయితీగా అంగీకరిస్తే రెండు సంవత్సరాల క్రిందట వినాయకవ్రత కథ విధానము పద్యరూపంలో వ్రాసే దాకా నాకూ తెలియదు.

శంకరాభరణం అనే గొప్ప సినిమాలో శంకరశాస్త్రిగారిని పాశ్చాత్య సంగీతం అంటే మాటలా మీకేం తెలుసు అని ఒకరు ఆక్షేపిస్తే ఆయన 'అరుపును' తానూ రాగయుక్తంగా పలికి మీరు ఈ చిన్న ఆలాపన అనండి అంటారు. గొంతు పెగలని వాళ్ళను చూసి ఆయన



అవతలి వాడి విద్య ఏంగొప్ప అని అహంకరించి, మీ అజ్ఞానం బయట పెట్టుకోకండి అని చివాట్లు వేస్తాడు.

చాల తేలిక అనుకునే చాలా వాటికి మనకు అర్థం తెలియదు. ఇంగ్లీషువాడు మనల్ని వదిలినా వాడి గోరోజనం మనుకి సమృద్ధిగా అంటగట్టి పోయాడు. మనకి తెలియదు, తెలియదని అంగీకరించే తెగువలేదు.

ఏది ఏమయినా మనం పారేసుకున్న విజ్ఞానం తిరిగి సంపాదించి దాచుకోవాలని చాలామంది సుమతుల ప్రయత్నిస్తున్నారు. అది 'ముదావహం'.

ఇంతకీ ఆ వినాయక స్తోత్రం గురించి ఇదంతా ఎందుకు నాయనా అంటే ఏదీ మనం అనుకున్నంత తేలిక కాదు. దాని అర్థమిది.



అహర్నిశం అంటే ప్రతిదినమూ, అగ (పర్వతము) నకు జ(పుట్టిన) పార్వతీదేవియొక్క, ఆననపద్మ అంటే ముఖ కమలమునకు అర్కం (సూర్యుడును), గజాననం (ఏనగుశిరస్సుకలవాడును), అనేకదంతం అనగా అనేక పాపములను హరించు వాడును, ఏకదంతం (ఒకే ఒక దంతము కలవాడును అయిన స్వామిని, ఉపాస్మహే (పూజింతును).

ఇంత చిన్న శ్లోకంలో ఇంత చిక్కుముడి ఉంటే ఆదిశంకరాచార్యుని గణేశ్వరుని పంచరత్నాలు వినడానికి అమృత వర్షంలా ఉన్నా అర్థమవటం అంత తేలిక కాదు.

ఆ ఉద్దేశ్యంతోనే ఈ పంచరత్న స్తోత్రానికి తేటగీతులలో తెలుగులోకి అనువదించి, మన ముందుతరాలవారు మనకంటే 'చదువుకొన్నవారు' అని అవసరం లేకపోయినా తాత్పర్యం జత కూర్చాను. నా ఉద్దేశ్యం ఇంకొకర్ని ఆక్షేపించి బాధించడం కాదు. ఆవు పొలంలో పడి మేస్తుంటే దూడ ఎప్పుడూ బుద్ధిగా బయట మెయ్యదు.

మన సంస్కృతిని మనమే తగలపెట్టుకుంటుంటే ఇక ఆ సర్వేశ్వరుడే మనని కాపాడాలి.

అడుగడుక్కీ అపరాధాలు చేస్తూనే ఉన్నాం. తెలిసి చేసేవి కొన్ని, తెలియక చేసేవి కొన్నీ. తెలిసి చేసే తప్పులు కూడా విధిలేక చేసేవి కొన్ని, కావాలని కామక్రోధాలవల్ల చేసేవి కొన్ని ఉంటాయి. ఏది ఏమయినా తప్పు తప్పే. తప్పుకు శిక్ష తప్పదు. నేటి న్యాయస్థానాల్లో కూడా తప్పు ఒప్పుకొని క్షమించమని 'Pleading guilty' అంటే న్యాయాధికారి శిక్ష తగ్గిస్తాడు. మరి జగత్పిత, భోళాశంకరుడికి మానవులెంత అల్పులో తెలుసు కాబట్టి తప్పక క్షమిస్తాడు. భక్తితో మనసారా ఈ శివాపరాధ క్షమార్పణ స్తోత్రం చదవండి.

గణేశ్వరుని పంచరత్నములను నిత్యమూ పఠించెడి భక్తులకు ఆస్వామి కొంగు బంగారంగా ఉంటాడని వేరే చెప్పాలా? ఈ స్తోత్రం రాగయుక్తంగా చదువుతుంటేనే ఒళ్ళు పులకరించిపోతుంది. అది ఆదిశంకర్యుల



రచనావైశిష్ట్యం. ఆయన వ్రాసిన అపరాధ క్షమార్పణ స్తోత్రంలోని ఆర్తి హృదయాలను కరిగిస్తుంది. కఠిన పాషాణ హృదయులనైనా చలింప చేస్తుంది.

వీటిని తాత్పర్య సహితంగా అనువదించటం నా పూర్వ జన్మ సుకృతం. ఇది చదివి ధన్యులవండి. తద్వారా నన్నూ చరితార్థుణ్ణి చేయండి.

ఇదివరలో నేను పద్యీకరించి వివిధ స్తోత్రాలను మీరు **www.geetadeeksha.com** అనే నా వెబ్‌సైట్‌లో పొందగలరు. **Please visit that web.**

మీకిష్టమైన దైవమెవరో, వారిపై మహనీయులు వ్రాసిన ప్రార్థనలు, స్తోత్రాలు, చరిత్ర కథలు, విశేషములు తెలుసుకోండి. కఠినమైన సంస్కృత శ్లోకాలకు బహు సరళమైన తెలుగు పద్యానువాదం రుచిచూడండి.



## శ్రీ శంకరాచార్యకృత

## 2. గణేశ పంచరత్నమ్

**1 శ్లో॥**

**ముదా కరాత్తమోదకం సదా విముక్తిసాధకం,**
**కళాధరావతంసకం విలాసిలోక రక్షకమ్**
**అనాయకైక నాయకం వినాశితేభదైత్యకం,**
**నతాశుభాశునాశకం నమామి తం వినాయకమ్.**

తే॥ ముదముతో దాల్చి కరముల మోదకముల
తను విముక్తికి సాధనమైనవాడు
దాల్చె శశికళన్ నగయట్లు తన శిరసున
జగతి రక్షించు తను విలాసముగ దాల్చి



తే॥ అన్ని లోకాల నాయకుడైన వాడు
గజ దనుజునికి నాశనకరుడు అతడు
గొలుచు వారి అశుభముల గూల్చువాడు
ఐన గణనాధు గొలిచెద ప్రణతులిచ్చి.

తా॥ తన చేతులతో అతి సంతోషముగా మోదకములను (లడ్లు) ధరించిన ఆ గణేశ్వరుడు తనయొక్క భక్తుల పాపవిముక్తికి గొప్ప సాధనమైన వాడు. తన శిరసున చంద్రకళను నగవలె ధరించెను. విలాసముగా ఆ నగను ధరించిన స్వామి జగములను రక్షించుచున్నాడు. ఆయన అన్ని లోకములకు నాయకుడైనవాడు. గజాసురుని అణచినవాడు. తనను కొలుచు వారల అశుభమును కూలద్రోయువాడు. అటువంటి విశిష్టుడైన గణనాధుని నమస్కారములు చేయుచూ పూజించెదను.

## 2 శ్లో॥

**నతేత రాతి భీకరం నవోదితార్క భాస్వరం, నమత్సురారి**
**నిర్జరం నతాధికాప దుద్ధరమ్**
**సురేశ్వరం నిధీశ్వరం గజేశ్వరం గణేశ్వరం,**
**మహేశ్వరం తమాశ్రయే పరాత్పరం నిరన్తరమ్**

తే॥ వెఱచి మ్రొక్కని వారికి భీకరుండు
అపుడె ఉదయించు భాస్కరుడట్టి తేజి
తను సురాసుర వందితుడైనవాడు
గొలుచువారి ఘోరాపత్తి గూల్చువాడు

తే॥ నిధికి, సురులకు, కరియూథ నేతఅతడు
గణపతియును పరాత్పరుడైనవాడు
అట్టి విఘ్ననాయకుని నేనతిశయముగ
ఆశ్రయింతు నిరంతరమమిత భక్తి.



తా॥ భయభక్తులతో మ్రొక్కని వారికి భయంకరుండును, అప్పుడే ఉదయించు భాస్కరుని బోలిన తేజస్సు కలవాడును, తాను దేవతలకూ రాక్షసులకు కూడ పూజనీయుడును, తనను కొలిచే దాసుల ఘోరమైన అరిష్టమును నశింపజేయువాడును, సంపదలకు దేవతలకు కరిసమూహములకు నాయకుడును, గణములకు అధిపతియును, పరాత్పరుడు అయిన ఆస్వామి మహానుభావుడు. అటువంటి విఘ్ననాయకుని నేను గొప్పగా మిక్కిలి భక్తితో ఎల్లప్పుడూ ఆశ్రయించి యుండెదను.

## 3 శ్లో॥

**సమస్త లోక శంకరం నిరస్త దైత్యకుఞ్జరం,**
**దరేతరోదరం వరం వరేభవక్త్రమక్షరమ్**
**కృపాకరం క్షమాకరం ముదాకరం యశస్కరం**
**మనస్కరం నమస్కృతాం నమస్కరోమి భాస్వరమ్**



తే॥ ఎల్ల లోకాలకు శుభంబు లిచ్చువాడు
ఘోర దైత్యులకంతంబు గూర్చువాడు
అతడు లంబోదరుడు, లేదు అంతమెపుడు
శ్రేష్ఠ గజముఖుండాతండు, శ్రేష్ఠుడతడు

తే॥ సంతసము, కృపా, క్షమలకు స్థానమతడు
తనకు ప్రణమిల్లు వారికి తానొసంగు
భాసమానుడై స్వామీయు మంచిమనసు
వినుతి ప్రణమిల్లెదను గాక! విఘ్నపతికి.

తా॥ సమస్త లోకములకు శుభముల నొసంగువాడును, ఘోరమైన రాక్షసులనంత మొందించువాడును, పెద్ద పొట్టగలిగినవాడును అయిన ఆ స్వామికి నాశనము లేదు. శ్రేష్ఠమైన కరిముఖము కలవాడు, శ్రేష్టుడుకూడ ఆ స్వామియే. ఆయన



ఆనందమునకు, దయకు, క్షమకు స్థానమైనవాడు. తనకు ప్రణామము చేయువారికి ఆ గణపతి దివ్యమైన తేజస్సుకై మంచి మనస్సును ప్రసాదించును. అటువంటి ఆ విఘ్నేశ్వరునకు విన్నపమొనరించు కొంటూ నమస్కరించెదను గాక!

## 4 శ్లో॥

**అకించనార్తి మార్జనం చిరన్తనోక్తి భాజనం,**
**పురారి పూర్వ నన్దనం సురారి గర్వచర్వణమ్**
**ప్రపంచనాశ భీషణం ధనంజయాది భూషణం,**
**కపోలదానవారణం భజే పురాణవారణమ్.**

తే॥ బాధలను దరిద్రులకెల్ల బాపువాడు
వేదనిలయుడు నిటులాక్షు పెద్దకొడుకు
దనుజ గర్వాపహారియై తనరు వాడు
విశ్వనాశన మొనరించు భీషణుండు

తే॥ అగ్ని బోలిన సురులకు ఆభరణము,
గండమున మదజలమది కారుచుండ
పూని ఆపజూచు పురాణ పూరుషుండు
అయిన గణనాధు భజియింతు ననుదినంబు.

తా॥ దరిద్రుల బాధలను తొలగించువాడును, వేదనిలయుడును, శివుని పెద్దకొడుకును, రాక్షస గర్వాంతకుడను, భయంకరుడై విశ్వనాశనమొనర్చు వాడును, అగ్నితేజస్సులైన దేవతలకు ఆభరణమునూ, చెక్కిళ్ళపై కారుచున్న మదజలమును తుడుచుకొను ఆపురాణ పురుషుని గణనాధుని నేనిదే ప్రతిదినము ప్రార్థించెదను.

**5 శ్లో॥**

**నితాన్తకాన్త దన్తకాన్తి మన్తకాన్త కాత్మజమ్, అచిన్త్యరూప**
**మన్తహీన మన్తరాయ కృన్తనమ్**
**హృదన్తరే నిరన్తరం వసన్తమేవ యోగినాం**
**తమేకదన్తమేవ తం విచిన్తయామి సంతతమ్.**



తే॥ దంతముల కాంతి జిమ్మునితాంతములకు
అంతకాంతకు నందనుడైనవాడు
తానచింత్యరూపుండును తనవినాశి
సర్వవిఘ్నములను జేయు సమసిపోవ.

తే॥ యోగి శ్రేష్ఠుల హృత్పద్మజగములందు
నిలిచియుండెడి వాడును నిగమనుతుడు
అయిన ఏకదంతుని నేను అనుదినంబు
అన్నివేళల చింతింతు సన్నుతింతు.

తా॥ గణేశ్వరునియొక్క దంతముల కాంతి, దిగంతముల వరకు వెదజిమ్మబడుచున్నది. యముని అంతమొందించు ఆ పరమేశ్వరుని యొక్క పుత్రుడైన వాడు ఆ స్వామి. ఆయన అచింత్యరూపుడు, నాశరహితుడు. ఆయన అన్ని విఘ్నములను నశింపచేస్తాడు. ఆయన యోగీశ్వరుల హృదయ కమలములలో నివసిస్తాడు. అటువంటి ఆ ఏకదంతుని నేను అనుదినమూ అన్నివేళలా ధ్యానించి, ప్రార్థించెదను.



## ఫలశ్రుతి

**శ్లో॥**

**మహాగణేశ పఞ్చరత్నమాదరేణ యోన్వహం,**
**ప్రజల్పతి ప్రభాతకే హృదిస్మరద్గణేశ్వరం**
**అరోగతా మదోషతాం సుసాహితీం సుపుత్రతాం,**
**సమాహితాయు రష్టభూతిమభ్యుపైతిసోచిరాత్.**

చం॥ తొలుత మహాగణేశ్వరునితో మొర
పెట్టుచు పంచరత్నముల్
పలికిన భక్తిశ్రద్ధలతొ ప్రార్థన నిత్యము
జేయ సత్హృదిన్
తొలుగును పాపముల్, రుజలు, తోడగు సాహితి
యున్, సుపుత్రులన్
కలుగును నిండు జీవితము గాంతురు భక్తులు
అష్టసద్సిరుల్.



తా॥ మహాగణాధిపతికి ఆదిలోనే తమగోడు తెలుపు కుంటూ, ఈ పంచరత్నములను భక్తిశ్రద్ధ పూర్వకముగా మంచి హృదయముతో, ప్రతిదినమూ పఠించి ప్రార్ధన చేసెడి భక్తులకు, పాపములు వ్యాధులు తొలగిపోవును. మంచి సాహిత్యము వారి తోడుగా ఉండి, సుపుత్రా భాగ్యము కలుగును. సంపూర్ణాయుర్దాయం కలిగి ఎనిమిది రకములైన గొప్ప భాగ్యములను పొందెదరు. ఇది తథ్యము.

**"సకల సన్మంగళానిభవంతు"**

## శివాపరాధ క్షమార్పణ స్తోత్రమ్

### 1 శ్లో॥

**ఆదౌ కర్మ ప్రసంగాత్కలయతి కలుషం మాతృకుక్షౌస్థితం మాం**
**విణ్మూత్రామేధ్యమధ్యేక్వథయతినితరాం జాఠరో జాతవేదాః**
**యద్యద్వైతత్ర దుఃఖం వ్యథయతి నితరాం శక్యతే కేనవక్తుం**
**క్షంతవ్యోమేఽపరాధః శివశివ శివభో శ్రీమహాదేవశంభో!!**

సీ॥ గతజన్మ కర్మలు కలిగించు పాపాలు
తల్లి గర్భమున నన్ తాము జొనిపె
మూత్ర పురీషాల మునిగి తేలితి నేను
అపవిత్రుడైయుంటి ననుదినంబు
జఠరాగ్నిననుబాగ 'సంతప్త' జేయగా
అచ్చోట నిత్యంబు అలిసి యుంటి
నిరతంబు బాధించు దరిలేని దుఃఖంబు
వ్యక్తీకరించెడివా



తే॥ ఓ శివా! మహాదేవా! మహేశ! శంభొ!
శంకరా! నాదు అపరాధ శతములన్ని
ఇటుల క్షమియించి కరుణింపు నిటలనయన!
పాహిమాం, పాహిమాం, పాహి, పార్వతీశ!

తా॥ పూర్వజన్మ కర్మలచే ప్రాప్తమయిన పాపము నన్ను తల్లి గర్భమున పడవేసినది. అపవిత్రమైన మలమూత్రముల మధ్యనున్న నన్ను జఠరాగ్ని బాగుగా పీడించినది. అక్కడ నిత్యమూ నిరంతరమూ బాధింపబడి దుఃఖించుచున్న నన్ను ఓదార్చువారెవ్వరున్నాడు? ఓ శివా! మహాదేవా! శంభొ! నాయొక్క అపరాధములు వందల సంఖ్యలో ఉన్నాయి. ఓత్రినయనా! శంకరా! నీవు నాతప్పులను క్షమించి నన్ను కరుణించుము, నన్ను రక్షింపుము, పార్వతీశా! పాహిమాం.



### 2 శ్లో॥

**బాల్యే దుఃఖాతిరేకో మలలులితవపుఃస్తన్యపానే పిపాసా**
**నోశక్తశ్చేంద్రియేభ్యో భవగుణజనితా జంతవో మాం తుదంతి**
**నానారోగాది దుఃఖాద్రుదన పరవశః శంకరం స్మరామి**
**క్షంతవ్యోమేఽపరధాఃశివశివ శివభో శ్రీమహాదేవ శంభో!!**

సీ॥ మలమూత్ర లేపిత కలుషిత దేహినై
పాపనై దుఃఖంబు బడసియుంటి
స్తన్య పానాసక్తి దవిలియుంటిని నేను
పలురోగముల క్రుంగి వగచుచుంటి
'శివమాయ' చేబుట్టు వివిధ జంతువులునన్
అమిత బాధల బెట్టెనపుడు బట్టి
అట్టి వేళనునైన అననైతి "శంకరా!"
స్మరణ నీనామంబు జరుపనైతి



తే॥ ఓ శివా! మహాదేవా! మహేశ! శంభొ!
శంకరా! నాదు అపరాధ శతములన్ని
నీవు క్షమియించి కరుణింపు నిటలనయన!
పాహిమాం, పాహిమాం, పాహి, పార్వతీశ!

తా॥ పాపాయిగా ఉన్నప్పుడు మలమూత్రములచే కలుషితమైన దేహమును కడుగుకొను శక్తికూడలేక, రోదించుచున్నవాడను. స్తన్య పానాసక్తుడనై ఏవేవో రోగములచే బాధింపబడితిని. శైవీమాయ వలన జన్మించిన ఎన్నోరకముల జంతువులచే బాధింపబడితిని. ఎన్నోరకములుగా దుఃఖిస్తూ కూడ ఆసమయముననైనా 'శంకరా!' నన్ను రక్షించు అని నిన్ను స్మరింపకుంటిని. ఎంతటి అవివేకిని! ఓ శివా! మహాదేవా! మహేశా! నా అపరాధములు వందల సంఖ్యలో ఉన్నవి. నీవు నన్ను క్షమించి కరుణింపుము. పాహిమాం, పార్వతీరమణా! నన్ను రక్షింపుము.

**3 శ్లో॥**

**ప్రౌఢోఽహం యౌవనస్థోవిషయవిషధరైః పంచభిర్మర్మసంధౌ**
**దష్టోనష్టో వివేక స్సుతధనయువతి స్వాదసౌఖ్యే నిషణ్ణః**
**శైవే చింతావిహీనం మమహృదయ మహోమానగర్వాధిరూఢః**
**క్షంతవ్యోఽపరాధః శివశివ శివభోశ్రీమహాదేవ శంభో!!**

సీ॥ యౌవనబల్మిచే నయితిని ప్రౌఢుడన్
విషయవాసనలెక్కి వివశుడైతి
'పంచసర్పములు' నామర్మస్థానంబుల
కాటేయ నాబుద్ధి కలిసె 'మంట'
వనితా, సుతుల, ధన వ్యామోహమున నేను
సుఖలాలసన్ జిక్కి సొలసియుంటి
అప్పుడైనను నీదు ఆలోచనే లేని
గర్విష్ఠి చిత్తంబుగరపె 'భ్రమలు'



తే॥ ఓ శివా! మహాదేవా! మహేశ! శంభొ!
శంకరా! నాదు అపరాధ శతములన్ని
నీవు క్షమియించి కరుణింపు నిటలనయన!
పాహిమాం, పాహిమాం, పాహి, పార్వతీశ!

తా॥ ఓ మహేశా! బాల్యావస్థనుండి యౌవనము రాగానే నేను ప్రౌఢుడినయ్యాను. తద్వారా విషయ వాంఛలు పెరిగి అదుపుతప్పిన వాడినయ్యాను. ఐదురకములైన సర్పములవంటి కోర్కెలు నామర్మస్థానములను కాటువేసి నాబుద్ధిని మంట కలిపి వేసినవి. స్త్రీ, పుత్ర, ధన వ్యామోహములతో సుఖాసక్తి అనే దాహంలో చిక్కి బయటకు రాలేక అలిసిపోయాను. అప్పుడు కూడ గర్విష్ఠియైన నాచిత్తము నీగురించి ఆలోచించకుండా భ్రమలోనే ఉండిపోయింది. ఓమహాదేవా! శివా! నా అపరాధములు వందల సంఖ్యలో ఉన్నాయి. నన్ను క్షమించి కరుణింపుము. ఓ నిటులాక్షా! నన్ను రక్షింపుము. పాహిమాం గౌరీ రమణా!



**4 శ్లో॥**

**వార్ధక్యే చేంద్రియాణాం విగత గతిమతిశ్చాధి దైవాదితాపైః**
**పాపై రోగై ర్వియోగై స్త్వనవసితవపుః ప్రౌఢి హీనంచదీనం,**
**మిథ్యామోహాభిలాషైర్భ్రమతిమమమనో ధూర్జటేర్ధ్యానశూన్యం**
**క్షంతవ్యోమేఽపరాధః శివశివశివభో శ్రీమహాదేవ శంభో!!**

సీ॥ ముదిమితో ఇంద్రియాల్ మొత్తంబు శిధిలమై
బుద్ధిమాంద్యమువల్లపోయె తెలివి
'ఆధిదైవికములు' యైన పాపములచే
రోగ వియోగాది రోత వలన
మేను జర్జరితమై మిగిలె, మోహము చేత
మనసు దుర్బలమయ్యె దీనమయ్యె
'శూలి' చింతన కూడ శూన్యమై, మిగిలెను
భ్రమ మాత్రమే నన్ను వదలకుండ



తే॥ ఓ శివా! మహాదేవా! మహేశ! శంభొ!
శంకరా! నాదు అపరాధ శతములన్ని
నీవు క్షమియించి కరుణింపు నిటలనయన!
పాహిమాం, పాహిమాం, పాహి, పార్వతీశ!

తా॥ ఓ శంకరా! వృద్ధాప్యంలో ఇంద్రియముల వేగం నశించి, బుద్ధి మందగించి, ఆధిదైవికాది పాపములవలననూ, రోగము, వియోగము వంటి బాధలవలనను శరీరం జర్జరితమై పోయినది. నామనస్సు వాంఛ, మోహములతో భరింపలేని దీనావస్థలోనున్నది. మహాదేవుని చింతన శూన్యమైపోయి భ్రమతో మిగిలిపోయి వున్నది. ఓ శివా! మహేశా! వందల సంఖ్యలో వున్న నా అపరాధములను నీవే క్షమించాలి. ఓ శంభో! నీవు నన్ను కరుణించి రక్షించాలి. ఓ పార్వతీ వల్లభా! పాహిమాం.

## 5 శ్లో॥

**నో శక్యం స్మార్తకర్మ ప్రతిపదగహన ప్రత్యవాయాకులాఖ్యం**
**శ్రౌతే వార్తాకథంమే ద్విజకులవిహితే బ్రహ్మమార్గే సుసారే**
**నాస్థా ధర్మే విచారః శ్రవణ మననయోః కిం నిధి ధ్యాసితవ్యం**
**క్షంతవ్యోమే2పరాధః శివశివశివభో శ్రీమహాదేవ శంభో!!**

సీ॥ అడుగడుగునకు తామత్యంత గహనమౌ
'స్మార్తకర్మలు' నేను వదలియుంటి
తెలియంగ 'బ్రహ్మంబు' ద్విజవిహితములైన
'శ్రౌతకర్మల'నెట్లు జరుపగలను?
'ధర్మమార్గంబున' తగు వాంఛ లేదాయె
శ్రవణ, మననములన్ శ్రద్ధ లేదు
'దశ' అట్లు నాకుండ ధ్యానంబు తగురీతి
ఎట్లు కుదురునయ్య ఇంక నాకు?



తే॥ ఓశివా! మహాదేవా! మహేశ! శంభో!
శంకరా! నాదు అపరాధ శతములన్ని
నీవు క్షమియించి కరుణింపు నిటల నయన!
పాహిమాం, పాహిమాం, పాహి, పార్వతీశ!

తా॥ అడుగడుగునకూ ఎంతో గూఢమైన ప్రాయశ్చిత్తములతో కూడియున్న స్మార్తకర్మలు నేను జరుపనేలేదు. ద్విజులకు విధింపబడి, బ్రహ్మనెరుంగుటకు చేయవలసిన శ్రౌతకర్మలనే విధంగా జరుపగలను? దానిగురించి ఇంకా చెప్పాలా? నాకు ధర్మమార్గంలో ఆసక్తిలేదు. శ్రవణము మననము వంటి దైవహిత కార్యాలపై శ్రద్ధలేదు. నా స్థితి ఆ విధంగా ఉంటే ఇకదైవ ధ్యానం ఎట్లా కుదురుతుంది? శంకరా! నేనెన్నో అపరాధములనొనరించి యున్నాను. ఓ శివా! మహాదేవా! వందలకొద్దీ ఉన్న ఆ అపరాధములను నీవే క్షమించి నన్ను కరుణించాలి. ఓ నిటలాక్షా! పాహిమాం. ఓ పార్వతీ వల్లభా! నన్ను రక్షింపుము.



## 6 శ్లో॥

**స్నాత్వాప్రత్యూషకాలే స్నపనవిధివిధౌన్ననాహృతంగాంగతో**
**యంపూజార్థంవా కదాచిద్బహుతర గహనాత్ఖండ బిల్వీదళా**
**ని, నానీతా పద్మమాలా సరసి వికసితా గంధ పుష్పే త్వదర్థమ్**
**క్షంతవ్యోమే2పరాధః శివశివశివభో శ్రీమహాదేవ శంభో!!**

సీ॥ తెలవారుజామున సలిపి స్నానము నేను
గంగాభిషేకంబు గరపనైతి
వనిబోయినే బిల్వ పత్రముల్ తేకుంటి
నీపూజ జరుపంగ నీవు మెచ్చ
సరసుల వికసించు సరసిజమ్ముల నిన్ను
అర్చించ తేనైతి ఆర్తితోటి
గంధ పుష్పములచే కడుభక్తితో నిన్ను
ఎన్నడు గొలువనే సన్నుతించి



తే॥ ఓశివా! మహాదేవా! మహేశ! శంభో!
శంకరా! నాదు అపరాధ శతములన్ని
నీవు క్షమియించి కరుణింపు నిటలనయన!
పాహి, మాంపాహి, మాంపాహి, పార్వతీశ!

తా॥ ఓ శంకరా! మహాదేవా! ప్రాతః కాలముననే స్నానమాచరించి నీ అభిషేకం కొరకు ఎన్నడూ గంగాజలమును తేలేదు. అడవులనుండి నీ పూజకు బిల్వపత్రములు తీసుకురాలేదు. సరస్సులనుండి వికసించిన పద్మములను తేలేదు. గంధ పుష్పములతో ఎన్నడూ నీకు అర్చించలేదు. ఓ పార్వతీరమణా! శివా! మహేశా! నా అపరాధ శతములను నీవే క్షమించాలి. ఓ శంభో! నన్ను కరుణించి నీవే రక్షించాలి. పాహిమాం, పాహిమాం.

### 7 శ్లో॥

**దుగ్ధైర్మధ్వాజ్య యుక్తైర్దధిసిత సహితైః స్నాపితంనైవలింగం**
**నోలిప్తం చందనాద్యైః కనకవిరచితైః పూజితం న ప్రసూనైః**
**ధూపైః కర్పూర దీపైర్వివిధరసయుతైర్నైవ భక్ష్యోపహారైః**
**క్షంతవ్యోమే2పరాధః శివశివశివభో శ్రీమహాదేవ శంభో!!**

సీ॥ పాలు, పెరుగు, నేయి, మధు, పంచదారతో
పంచామృత స్నానమెంచి యెపుడు
నీదు లింగమునకు నేను చేయకపోతి,
చందనాదుల పూత జరుపనైతి
స్వర్ణ పుష్పములతో జరుపనైతిని పూజ
ధూపంబు దీపంబు జూపనైతి
నానారసములున్న నైవేద్యమును నీకు
ప్రీతితో ఎన్నడూ పెట్టనైతి



తే॥ ఓ శివా! మహాదేవా! మహేశ! శంభొ!
శంకరా! నాదు అపరాధ శతములన్ని
నీవు క్షమియించి కరుణింపు నిటలనయన!
పాహి! మాంపాహి! మాంపాయి! పార్వతీశ!

తా॥ ఓ మహాదేవా! శివా! పాలు, పెరుగు, నేయి, తేనె, చక్కెరలవంటి పంచామృతములతో నీ లింగమునకు అభిషేకము నేను ఎప్పుడూ చేయించలేదు. చందనములవంటి లేపనములు నీకు పూయలేదు. స్వర్ణ పుష్పములతో నిన్ను పూజించలేదు. ధూప దీపములతో నీకు ఆరాధన జరుపలేదు. నానారసములుగల చక్కటి నైవేద్యమును నీకు ఎన్నడూ ప్రీతితో పెట్టలేదు. ఓ మహేశా! శంకరా! వందలకొద్దీ వున్న నా అపరాధములను క్షమించి నాపై దయచూపుము. ఓ పార్వతీ రమణా! పాహిమాం. నన్ను రక్షింపుము.



### 8 శ్లో॥

**ధ్యాత్వా చిత్తేశివాఖ్యం ప్రచురతరధనం నైవదత్తం ద్విజేభ్యో**
**హవ్యంతే లక్ష సంఖ్యైర్హుత వహవదనే నార్పితం బీజమంత్రైః**
**నోతప్తం గాంగతీరే వ్రతజపనియమై రుద్రజాప్యైర్నవేదైః**
**క్షంతవ్యోమే2పరాధః శివశివశివభో శ్రీమహాదేవ శంభో!!**

సీ॥ మనసార 'శివనామ మంత్రంబు' స్మరియించి
భూరి దక్షిణలీయ భూసురులకు
నిజభక్తినొక లక్ష బీజమంత్రములతో
ఆహుతులీనైతి అగ్నియందు
వేద విదితముగా పెక్కుమంత్రములతో
జప, వ్రతాదుల నేను జరుపనైతి
గంగాతటంబున గట్టి దీక్షను బూని
ఎట్టి సాధన తలపెట్టనైతి



తే॥ ఓ శివా! మహాదేవా! మహేశ! శంభొ!
శంకరా! నాదు అపరాధ శతములన్ని
నీవు క్షమియించి కరుణింపు నిటలనయన!
పాహి, మాంపాహి, మాంపాహి, పార్వతీశ!

తా॥ ఓ శంకరా! మహేశా! నేను మనస్పూర్తిగా ఎన్నడూ శివనామ మంత్రోచ్చారణ జరుపలేదు. బ్రాహ్మణులకు మంచి దక్షిణలనిచ్చి గౌరవించలేదు. నీబీజమంత్రములను ఒక లక్షమాట్లు జపించలేదు. పోనీ అగ్నిలో హోమంచేసి ఆరాధించలేదు. ఎన్నియో మంత్రములతో వేద విహితముగా నీ జపముకాని వ్రతముకాని చేయనే లేదు. గంగానది ఒడ్డున కూర్చుని నీకొరకు ఏవిధమైన సాధన చేయలేదు. పైగా వందలకొద్దీ అపరాధములను చేశాను. ఓ మహాదేవా! నా అపరాధములను నీవు మన్నించి నన్ను కరుణించు. ఓ పార్వతీవల్లభా! పాహిమాం. నన్ను రక్షింపుము.

## 9 శ్లో॥

**స్థిత్వాస్థానే సరోజే ప్రణవమయ మరుత్కుండలే సూక్ష్మమార్గే
శాంతేశాంతే ప్రలీనే ప్రకటిత విభవే జ్యోతిరూపే పరాఖ్యే
లింగంగేజ్ఞే బ్రహ్మావాక్యే సకల తనుగతం శంకరం న స్మరామి
క్షంతవ్యోమే2పరాధః శివ శివశివభో శ్రీమహాదేవ శంభో!!**

సీ॥ ఏ సూక్ష్మమార్గమున్ ఎరిగి సహస్రంపు
దళముల కమలంబు తాముజొచ్చి
ప్రాణి సమూహముల్ ప్రణవనాదంబులో
లీనమైపోవునో అనుదినంబు
వేదవాక్యమెచట వివరణావిర్భూత
జ్యోతిరూపమ్మున జొచ్చియుండి
బహుశాంతియుతమైన పరమమౌతత్వంబు
లోన మనస్సది లీనమగునొ,
ఆ కమలమునందు అణువణువున నున్న
నిను నేస్మరించ కళ్యాణకరుని



తే॥ ఓశివా! మహాదేవా! మహేశ! శంభో!
శంకరా! నాదు అపరాధ శతములన్ని
నీవు క్షమియించి కరుణింపు నిటలనయన!
పాహి, మాంపాహి, మాంపాహి, పార్వతీశ!

తా॥ ఏ సూక్ష్మమార్గమును గ్రహించుటవలన సహస్రదళ కమలమున ప్రవేశించి ప్రాణి సమూహములు ఓం అనే ప్రణవనాదములో లీనమైపోవునో, ఎచ్చట వేదవాక్య తాత్పర్య భూతమై పూర్ణముగా ఆవిర్భవించిన జ్యోతిరూపము శాంత పరమ తత్త్వములో మనస్సులీనమైపోవునో, ఆ కమలము నందుండి నేను సర్వాంతర్యామినీ కళ్యాణకారకుడవు అయిన నిన్ను స్మరించకపోవుచుంటిని. అయ్యో! ఓ శంకరా! మహాదేవా! నా అపరాధ సహస్రములను నీవే క్షమించి నన్ను కరుణించవలెను. ఓ పార్వతీ వల్లభా! నీవే నన్ను రక్షించవలెను. తండ్రీ! పాహిమాం.



## 10 శ్లో॥

**నగ్నోనిస్సంగ శుద్ధ స్త్రిగుణవిరహితో ధ్వస్తమోహాంధకారో
నాసాగ్రే న్యస్తదృష్టిర్విదిత భవగుణో నైవ దృష్టఃకదాచిత్
ఉన్మన్యావస్థయాత్వాం విగతకలిమలం శంకరంన స్మరామి
క్షంతవ్యోమే2పరాధః శివశివశివభో శ్రీమహాదేవ శంభో!!**

సీ॥ త్రిగుణములకు నేనతీతుండనై, దిగం
బరునిగా, నిస్సంగ మరయనైతి
నా మోహమున్ ద్రుంచి, నాసికాగ్రంబున
దృష్టినంతయును కేంద్రీకరించి
కళ్యాణగుణములు కలవాడవమితంబు
గాఅని నేర్చియున్ కాననైతి
వితరణ నశియించి వెర్రినై స్మరియింప
నైతి నీ కళ్యాణమైనరూపు



తే॥ ఓశివా! మహాదేవా! మహేశ! శంభో!
శంకరా! నాదు అపరాధశతములన్ని
నీవు క్షమియించి కరుణింపు నిటలనయన
పాహి! మాంపాహి! మాంపాహి! పార్వతీశ!

తా॥ దిగంబరినై, నిస్సంగుడనై, త్రిగుణాతీతుడనై మోహాంధకారమును పటాపంచలుగావించి, నాసికాగ్రమున దృష్టిని కేంద్రీకరించి ఓ శంకరా! నేను నీ అనంతకళ్యాణ గుణములను గ్రహించి కూడా నిన్ను ఎన్నడూ దర్శింపలేదు. ఉన్మాదావస్థతో కలిమలరహితుడనై నీ కళ్యాణ స్వరూపమును స్మరించనైనా చేయకపోతిని. ఓ మహాదేవా! శివా! నా అపరాధములు వందల సంఖ్యలో ఉన్నాయి. నన్ను క్షమించి కరుణ జూపుము. ఓ పార్వతీవల్లభా! నన్ను రక్షింపుము. పాహిమాం.

## 11 శ్లో॥

**చంద్రోద్భాసితశేఖరే స్మరహరే గంగాధరే శంకరే**
**సర్పైర్భూషిత కంఠకర్ణ వివరే నేత్రోత్థవైశ్వానరే**
**దంతిత్వక్కృత సుందరాంబరధరే త్రైలోక్య సారేహరే**
**మోక్షార్థం కురు చిత్తవృత్తి మఖిలామన్యైస్తుకిం కర్మభిః?**

సీ॥ నెలవంక మెరిపించు ఫాలభాగపు వాడు
చిత్తజు గర్వంబు చెరచువాడు
గంగమ్మ శిరసున కలవాడు, ముక్కంటి,
కళ్యాణరూపంబు కలుగు వాడు
భుజగాభరణముల భూషితుండైనట్టి
గళము, కర్ణంబులు కలుగువాడు
అగ్నిప్రజ్వలియుంచు అక్షులు కలవాడు
హస్తిచర్మము దాల్చు హరుడు భవుడు



తే॥ మూడు లోకాలనేలెడి వాడు శివుడు
పరమునరయంగ నిజచిత్త భావములను
మగ్నమొనరించి శరణంద వలెను, గాని
ఇతర కర్మలచే మేలు ఏమి కలుగు?

తా॥ చంద్రకళ చేత వెలుగొందుచున్న ఫాలభాగము కలవాడును, మన్మధుని మదమును మట్టుబెట్టిన వాడునూ, గంగాధరుడునూ, కళ్యాణ స్వరూపుడును, నాగాభరణములచే అలంకరింపబడిన మెడ, చెవులు గలవాడును, నేత్రములలో అగ్నిప్రజ్వరిల్లుతున్నట్లు చూచువాడును, గజచర్మమును వస్త్రముగా ధరించు భవహరుడును, ముజ్జగములను పరిపాలించు ఆ శంకరుని మోక్షపదమునందుటకు మనస్సులోని భావములయందు నిమగ్నముజేసి శరణాగతులవుట తగినపని. కాని ఏవేవో ఇతర కర్మల ద్వారా ఆ పరమేశ్వరుని పొందాలనుకోవటం వల్ల ఏంలాభం?



## 12 శ్లో॥

**కిం వానేన ధనేన వాజి కరిభిః ప్రాప్తేన రాజ్యేన కిం**
**కిం వా పుత్ర కళత్రమిత్ర పశు భిర్దేహేన గేహేనకిమ్.**
**జ్ఞాత్వైతత్ క్షణభంగురం సవదిరే త్యాజ్యం మనో దూరతః**
**స్వాత్మార్థం గురువాక్యతో భజభజ శ్రీపార్వతీ వల్లభమ్.**

సీ॥ ధన, అశ్వ, గజములు, తగు భోగములు అన్ని
ఉండి లాభం బేమి? ఒరుగునేది?
సర్వాధికారివై సామ్రాజ్యముండియు
కలుగు 'సౌఖ్యం'బేది? తెలియరాదు
దారా, సుతులు, హితుల్, తనువు, గేహములతో
ఏప్రయోజనముండు? ఎరుక కాదు
'క్షణభంగురము'లని చక్కగా యోచించి
త్యజియించ వలె వాని 'దరికిబోక'



తే॥ ఓ మనస్సా! ధరించవే ఉత్తమముగ
పరమ గురువాజ్ఞ నాత్మానుభవముకొరకు
పార్వతీశుని శంకరు భజనచేత
ఆ పరాత్పరు కృప నీకు అమరుగాక!

తా॥ ఓ మనస్సా! నీకు గజములు అశ్వములు ధనము సంపదలు వంటి భోగములు మెండుగా వుండి ఏమి లాభం కలుగుతుంది? ఏమి ఒరుగుతుంది? విశాలమైన రాజ్యం వుండి సర్వాధికారివైనంత మాత్రంచేత ఏసుఖం ప్రాప్తిస్తుంది? భార్య, పుత్రులు, బంధువర్గము, శరీరమూ, ఇళ్ళూ వాకిళ్ళతో ఏ ఉపయోగం కలుగుతుందో తెలియదుకదా! ఇవన్నీ క్షణకాలములో నశించిపోయేవని గ్రహించి వాటి దరికిపోక విడిచిపెట్టడం ఉత్తమం కదా! అందువల్ల సద్గురువుయొక్క ఉత్తమమైన ఉపదేశము స్వీకరించి పార్వతీవల్లభుని శరణు పొందుము. ఆయన దయ నీకు కలుగుగాక.

## 13 శ్లో॥

**ఆయుర్నశ్యతి పశ్యతాం ప్రతిదినం యాతిక్షయం యౌవ్వనం**
**ప్రత్యాయాంతిగతాఃపునర్నదివసాఃకాలోజగద్భక్షకః**
**లక్ష్మీస్తోయతరంగ భంగచపలా విద్యుచ్చలం జీవితం**
**తస్మాన్మాం శరణాగతం శరణద త్వం రక్ష రక్షాధునా.**

సీ॥ చూచుచుండంగనే చూపుమందంబౌను
  ఆయువు తరుగుచూ అంతమౌను
గమనించి చూచిన గతియించు దినమేది
  తిరిగి యెన్నటికిని మరలిరాదు
కనుమూసి తెరచిన కరుగు యౌవ్వనమంత
  తప్పించ నెవ్వరి తరముకాదు
కాలుడు సమవర్తి కన్నీటికాగడు
  భక్షించుచున్నాడు, పవలు రేయి



తే॥ జలతరంగము వలె 'లక్ష్మి' చపల తాను
అరయ బ్రతుకు చంచలమైన మెఱపుతీగ
కనుక శరణాగతుని నన్ను కనికరించి
నీవె రక్షింప తగునయ్య నీలకంఠ!

తా॥ ఓ నీలకంఠా! చూస్తుండంగానే కనుచూపు సన్నగిల్లి పోతుంది. నెమ్మది నెమ్మదిగా తగ్గిపోతూ ఆయువు సమాప్తమవుతుంది. ఒక్కసారి ఆలోచిస్తే గడిచిపోయిన రోజు ఎన్నటికీ తిరిగిరాదు కదా! ఏ యౌవ్వనబలం చూసుకుని మనిషి మురిసిపోతుంటాడో అది కళ్ళుమూసి తెరిచే సరికి మాయమవుతుంది. దాన్ని తప్పించటం ఎవరి వల్లనూ కాదు. ఆ యమధర్మరాజు చూడబోతే పక్షపాతబుద్ధిలేని సమవర్తి. కన్నీరు కార్చి ఏడ్చినా రేయింబవళ్ళూ జీవులని భక్షిస్తూనే ఉంటాడు. సిరులతల్లి ఆ శ్రీమహాలక్ష్మి నీటి అలవలె చపలమైనది. ఎగిసిపడే స్వభావంకలది. ఆకాశంలో వేగంగా చలించె మెరుపు తీగలాంటిది మానవజీవితం. కనుక, నీకు శరణాగతుడనైన నన్ను దయజూడు నన్ను రక్షించుటకు నీవే తగినవాడవు.



## 14 శ్లో॥

**కరచరణ కృతం వాక్కాయజం కర&మజం వా**
**శ్రవణ నయనజంవా మానసంవాపరాధం**
**విహితమవిహితంనా సర్వమేతత్ క్షమస్వ**
**జయజయకరుణాబ్ధే శ్రీమహాదేవ శంభో!!**

చం॥ కరచరణంబులన్, కనుల, కర్ణములన్,
  మనసేంద్రియమ్ములన్,
కొరవడు వాక్ తనూ గతుల కూడని కర్మల
  తప్పులెన్నియో
నెరపితి మందభాగ్య నేరకయె, నన్ క్షమియించు
  సర్వమున్
హర! మహదేవ! నీకు జయమౌను కృపాజలధే!
  సదాశివా!



తా॥ ఓ మహాదేవా! హరా! కాళ్ళు, చేతులు, కళ్ళు, చెవులు, మనస్సు తక్కిన ఇంద్రియములు, వాక్కు, శరీరంచేత కూడని కర్మలను, తప్పులను చేసియున్నాను. బుద్ధికి తెలియక కొన్నిచేశాను. శంకరా! ఆ సర్వమూ క్షమింపుము ప్రభూ! ఓ హరా! నీకు జయము కలుగుగాక. సదాశివా! కృపాసాగరా! నీకు జయము కలుగుగాక.

## మంగళము

ఆ॥ మంగళమగు సర్వమంగళా! శంకరా!
మంగళంబు నీకు మా గణేశ!
మంగళమగునయ్య వల్లీమనోహరా!
మంగళమగు గాక! మహిప్రజలకు.